# నమస్తే తెలంగాణ

జోగులాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, శనివారం 30 డిసెంబర్ 2023 | JOGULAMBA GADWAL WANAPARTHY




కాళికాదేవిఆ లయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## వైభవంగా కాళికామాత బ్రహ్మోత్సవాలు

పాలమూరు, డిసెంబర్ 29 : మహబూబ్‌నగర్ రూరల్ మండలం రామచంద్రపురంలో కాళికామాత బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు మాజీ మంత్రి తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు శ్రీను, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, దేవేందర్ రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, మస్తాన్, మహేశ్ గౌడ్, శివప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల పంటలను పరిశీలిస్తున్న వైస్ చాన్స్‌లర్ బి.నీరజ

## క్రీడలతో శారీరక దృఢత్వం

- రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ నీరజాప్రభాకర్

పెద్దమందడి, డిసెంబర్ 29 : విద్యార్థులు సాధించే విజయాల్లో మానసిక, శారీరక దృఢత్వం కీలకపాత్ర పోషిస్తాయని రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నీరజాప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మోజర్ల ఉద్యానవన కళాశాలలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసిక వికాసానికి ఎంతో అవసరమని, మానసిక ఒత్తిడి లేని చదువుతో విద్యార్థులు మరింత ఎక్కువ చ దువులో రాణిస్తారన్నారు. దైనందిన జీవితంలో క్రీడలను ఒక భాగం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ని తిలకించి క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ విజయ, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య, ఎస్టేట్ ఆఫీసర్ నాగేశ్వర్‌రెడ్డి, ఓఎస్‌పే డాక్టర్ షహనాజ్, డాక్టర్ శంకర్‌స్వామి, డాక్టర్ గౌతమి, డాక్టర్ శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## కరెంటు బిల్లులపై స్పష్టత ఇవ్వండి

- రైతుబంధు డబ్బులు త్వరగా పంపిణీ చేయాలి
- మండల సమావేశంలోఅ ధికారులనుప్రశ్నించినప్రజా ప్రతినిధులు

నవాబ్‌పేట, డిసెంబర్ 29 : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత కరెంటుపై స్పష్టత ఇవ్వాలని పలువురు మండల ప్రజాప్రతినిధులు ట్రాన్స్‌కో అధికారులను కోరారు. మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఎంపీపీ అనంతయ్య అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ట్రాన్స్‌కో ఏఈ సంతోష్‌కుమార్ తమ శాఖ పనితీరును వివరిస్తుండగా పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు స్పందించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా అందిస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోవాలని సర్పంచులు గోపాల్‌గౌడ్, సత్యం, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి తదితరులు సభ దృష్టికి తెచ్చారు. లేదంటే జనవరి నుంచి కరెంటు బిల్లులు కట్టరని స్పష్టం చేశారు. అనంతరం వ్యవసాయ శాఖ పనితీరును మండల వ్యవసాయాధికారి కృష్ణకిశోర్ వివరిస్తుండగా, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, కారుకొండ ఎంపీటీసీ గోపాల్, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో వరినాట్లు వేసుకునే సమయం వచ్చిందని, నేటికీ రైతుబంధు డబ్బులు పడక, రైతులు సాగును చాలావరకు తగ్గించుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం పంచాయతీరాజ్, నీటిపారుదల, విద్య, వైద్యం, పశు వైద్యం, ఉద్యానవన, ఆబ్కారీ, ఆర్టీసీ, ఐసీడీఎస్, తదితర శాఖల పనితీరుపై సభలో చర్చ జరిగింది.

***సభ మధ్యలోనే వెళ్లిపోయిన అధికారులు..***

మండల సర్వసభ్య సమావేశం నుంచి కొందరు అధికారులు, మధ్యలోనే నెమ్మదిగా బయటికి వెళ్లారు. మరికొందరు గైర్హాజరయ్యారు. దీనిపై అధికారులు ఇలా వ్యవహరించడమేమిటని పలువురు ప్రజాప్రతినిధులు సభలో చర్చించుకొన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ నర్సిములు, ఎంపీడీవో శ్రీలత, కోఆప్షన్ సభ్యులు తాహెర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## అంతా మా ఇష్టం..

మల్దకల్‌లో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేతలు

- అధికారం మాది.. మేము చెప్పిందే చేయండి
- అధికారులఆ దేశాలు బేఖాతరు చేసిన కాంగ్రెస్ నేతలు

గద్వాల అర్బన్, డిసెంబర్ 29 : పోలీస్ అధికారుల ఆదేశాలు సామాన్యులకేనా.. రాజకీయ నాయకులకు వర్తించవా అంటే.. ప్రస్తుత పరిస్థితులు అవుననే సమాధానం చెబుతున్నాయి. మల్దకల్ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు వేర్వేరుగా బండలాగుడు పోటీలను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకునే అవకాశం ఉందని గ్రహించిన పోలీసులు పోటీలను అడ్డుకొని అవగాహన కల్పించి 144 సెక్షన్ అమలు చేశారు. ఈ క్రమంలో పోలీసుల ఆదేశాలను బీఆర్‌ఎస్ నాయకులు పాటిస్తూ పోటీలను విరమించుకున్నారు. అయితే 'అధికారం మాదే.. మేమే నిర్వహిస్తాం' అంటూ కాంగ్రెస్ నాయకులు పోటీలను ప్రారంభించారు. అధికారుల ఆదేశాలను హస్తం నేతలు బేఖతారు చేయడంతో పోటీలను నిలిపివేశారు. 'అధికారంలో మేమే ఉన్నాం.. మేము చెప్పిందే మీరు వినాలి.. మాకే ఎదురు చెబుతారా..' అంటూ పోలీసులను నిలదీశారు. పోటీలను అడ్డుకోవడంపై గురువారం మల్దకల్‌లో కాంగ్రెస్ నాయకులు రాత్రి వరకు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో 144 సెక్షన్‌ను కాంగ్రెస్ నాయకులు ఉల్లంఘించడంతోపాటు జంతు హింసకు సంబంధించిన కేసులను వారిపై నమోదు చేశారు. అయితే శుక్రవారం కూడా వారు మళ్లీ పోటీలను నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ఆదేశించినా పోటీలు ఆపకుండా నిర్వహించడం ఏంటని ప్రజలు చర్చించుకుంటున్నారు. సామాన్యులకు ఒక న్యాయం.. రాజకీయ నాయకులకు ఒక న్యాయం ఉంటుందా అంటూ ప్రశ్నిస్తున్నారు. గద్వాల ప్రాంతంలో కొన్నేండ్లుగా ఎలాంటి ఘర్షణ వాతావరణం లేకుండా ఉండగా అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన అనంతరం కాంగ్రెస్ నాయకులు ఘర్షణలకు దిగుతుండడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే శుక్రవారం బండలాగుడు పోటీలను నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు తిరుపతయ్య, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, బండ్ల రాజశేఖర్‌రెడ్డి, అల్వాల రాజశేఖర్‌రెడ్డి, పెద్దొడ్డి రామకృష్ణతోపాటు 36 మందిపై మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో రెండోరోజూ కేసులు నమోదు చేశారు.

***కేసులు నమోదు చేస్తున్నాం..***

లా అండ్ ఆర్డర్‌ను కాపాడడమే పోలీస్ అధికారుల కర్తవ్యం, మల్దకల్ ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేశామని గద్వాల డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ ప్రాంతంలో ఎలాంటి బండలాగుడు పోటీలను నిర్వహించకూడదని అందరికీ వివరించామన్నారు. జంతుహింస చట్ట ప్రకారం నేరం, ఈ విషయం అందరికీ తెలియచేశామన్నారు. అయినా అధికారుల ఆదేశాలు పాటించకుండా పోటీలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులపై కేసులు నమోదు చేశామని చెప్పారు.



గద్వాలలో స్వెట్టర్లు వేసుకొని వెళ్తున్న మహిళలు, చిన్నారులు



నల్లమలలో..



గద్వాలలో కమ్ముకున్న పొగమంచు



గద్వాలలో ఉదయం 8 గంటలైనా వదలని మంచు

# గజగజ

- ఉమ్మడి పాలమూరు జిల్లాను వణికిస్తున్న శీతల గాలులు
- పొద్దస్తమానం ఎండ.. పొద్దుగూకితే చలి
- కమ్మేస్తున్న పొగమంచు
- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- నల్లమలను కప్పేసిన మంకర
- మూడ్రోజులు తీవ్ర ప్రభావం
- జాగ్రత్తగా ఉండాలన్న వైద్యులు

*ఉమ్మడి పాలమూరు జిల్లాపై చలి పంజా విసురుతోన్నది. పొద్దస్తమానం ఎండ తీవ్రత ఉంటుండగా.. పొద్దుగూకితే శీతల గాలులు వణికిస్తున్నాయి. ఉత్తర, ఈశాన్య దిశ గాలుల ప్రభావంతో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలికాలం మధ్యదశకు చేరడంతో తీవ్రత ఎక్కువైంది. దీనికి తోడు ఐదు జిల్లాలను మంచు దుప్పటి కప్పేస్తున్నది. సోమవారం పలు ప్రాంతాలంతా పొగమంచుతో నిండిపోయాయి. ఉదయం 9 గంటల వరకు భానుడు సైతం మంచులో చిక్కుకున్నాడు. రోడ్లు కనిపించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వాహనాలన్నీ లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించాయి. మంకరలో పల్లె, పట్నాలు సరికొత్త అందాలతో కనువిందు చేశాయి. ముగ్ధ మనోహరంగా మారిపోయాయి. మరో మూడ్రోజులు చలి ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ సూచనలతో ప్రజలు, పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు.*

*- నాగర్‌కర్నూల్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ)*

ఉమ్మడి జిల్లాల్లో చలి పులిలా బెంబేలెత్తిస్తోంది. శీతాకాలం మధ్యలో ఉండటం జనవరి సమీపిస్తుండడంతో ఈ చలి ప్రభావం మరింత చూపిస్తోంది. సంక్రాంతికి ముందే చుక్కలు చూపిస్తోంది. పక్షం నుంచి రోజురోజుకూ పెరుగుతుండటంతోపాటుగా క్రమంగా ఉష్ణోగ్రతలూ పడిపోతున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వారం కిందట తుఫాన్ ప్రభావంతో ఏర్పడిన చల్లదనంతో నాలుగైదు రోజులు ప్రజలు తల్లడిల్లారు. తాజాగా మరో మూడ్రోజులు చలి ప్రభావం పెరుగుతుందని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో ప్రజలు ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, ఇతర అనారోగ్య సమస్యలున్న వారు జాగ్రత్తగా ఉండాల్సిందిగా వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ ప్రభావం చూపిస్తుండగా సూర్యుడు అస్తమించడంతో చల్లదనం పెరుగుతున్నది. దీనివల్ల ఒక్క రోజులో ఎండలు, చలి తీవ్రతలో తేడాలతో మారుతున్న వాతావరణం మనుషుల ఆరోగ్యంపై ప్రభావం చూపనున్నాయి. ఫలితంగా సాయంత్రం నుంచి ఇండ్లకే పరిమితమవుతున్నారు. షాపింగ్ మాల్స్, రైతుబజార్లు, ఇతర వ్యాపార సముదాయాలు రాత్రి 8 గంటలకే మూతబడుతున్నాయి. సాయంత్రం 5:30 నుంచే చీకటి అవుతుండడంతో మరుసటి రోజు ఉదయం 6:30 గంటల తర్వాతే వెలుతురు కనిపిస్తోంది. ఉదయం 10 గంటల వరకూ చలి తీవ్రత కనిపిస్తోంది. చలిని తట్టుకునేందుకు స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, సాక్స్‌లు, గ్లోవ్స్‌తో పాటుగా రూం హీటర్లను తెచ్చుకొని చలి నుంచి రక్షణ పొందుతున్నారు. చలి కోట్లు, టోపీలు అమ్మే వారి వ్యాపారం ఊపందుకున్నది. పలు పట్టణాల్లో రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేసి ఈ దుస్తులు విక్రయిస్తున్నారు. ఇక ప్రస్తుతం కరోనా ప్రభావం చూపుతుండడంతో మరింత జాగ్రత్తగా ఉండే పరిస్థితులు ఉన్నాయి.

***కమ్మేసిన మంకర***

రెండ్రోజుల నుంచి పెరిగిన చలితో పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా పొగ మంచు కమ్మేస్తున్నది. సోమవారం ఉదయం 9 గంటల వరకూ పలు ప్రాంతాలను పొగ మంచు చుట్టుముట్టింది. ఇండ్లు, రోడ్లు కనిపించకుండా దట్టంగా కమ్మేసిన మంచును చూసి పిల్లలు సంతోషడ్డారు. అయితే వాహనదారులకు మాత్రం రోడ్లు కనిపించకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉంటే నల్లమలలో చలి ప్రభావం అధికంగా ఉన్నది. మన్ననూర్ నుంచి అమ్రాబాద్ వరకు ఉన్న అటవీ ప్రాంతంలో మంచు, చలితో ప్రజలు సాయంత్రమైతే ఇండ్లకే పరిమితమవుతున్నారు. వాహనదారులు సాయంత్రం వరకే ఇండ్లకు చేరాలని, మంచుతో రోడ్లు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని రవాణాశాఖ అధికారులూ సూచిస్తున్నారు.



నాగర్‌కర్నూల్‌లో కమ్మేసిన పొగమంచు

***పడిపోయిన ఉష్ణోగ్రతలు***

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. సాయంత్రం వేళల్లో 21 డిగ్రీలకు కనిష్ఠంగా నమోదవుతున్నాయి. గత 24 గంటల్లో జిల్లాలోని కోడేరులో అత్యధికంగా 31 డిగ్రీల గరిష్ఠంగా నమోదుకాగా చారకొండలో 17.9 కనిష్ఠంగా డిగ్రీలు నమోదైంది. జిల్లా సరాసరి చూస్తే గరిష్ఠంగా 31.1 డిగ్రీలు ఉండగా.. కనిష్ఠంగా 17.1 డిగ్రీలుగా ఉన్నది. ఇలా సంక్రాంతి రాబోతున్న తరుణంలో చలి ప్రభావం పెరుగుతూ వస్తున్నది.

### ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



చలితోపాటు గాలులూ వీస్తుండటంతో ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. పిల్లలు, వృద్ధులతో పాటు ఆస్తమా, గుండె జబ్బులున్న వారు చలికి బయటికి రావొద్దు.. ప్రతి ఒక్కరూ స్వెట్టర్లు, తల, చెవులు కప్పి ఉంచేలా టోపీలు, వీలైతే చేతులకు గ్లోవ్స్, కాళ్లకు సాక్స్ ధరించాలి. పగటి వేళల్లోనే మార్కెట్, ఇతర పనులు ముగించుకోవాలి. అత్యవసరమైతేనే రాత్రి వేళల్లో ప్రయాణాలు చేయాలి.

**- సుధాకర్‌లాల్, డీఎంహెచ్‌వో, నాగర్‌కర్నూల్**

## ఆత్మజ్ఞానంతో ఆనందమయ జీవితం

- స్వర్ణమాల పత్రీ



ధ్యాన మహాయాగం సభలో మాట్లాడుతున్నస్వర్ణమాల పత్రీ

కడ్తాల్, డిసెంబర్ 29 : నిత్య సాధనతో ఆత్మజ్ఞానం సిద్ధిస్తుందని, దీనితో ఆనందమయ జీవితాన్ని పొందవచ్చని ది ఇండియన్ పిరమిడ్ స్పిరిచ్‌వల్ సొసైటీస్ మూవ్‌మెంట్ వ్యవస్థాపక సభ్యురాలు స్వర్ణమాల పత్రీ అన్నారు. మండల కేంద్రం సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో ది పిరమిడ్ స్పిరిచ్‌వల్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం 5నుంచి 8గంటల వరకు నిర్వహించిన ప్రాతఃకాల ధ్యానంలో ఆధ్యాత్మిక గురువులు, పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ధ్యానులనుద్దేశించి స్వర్ణమాల పత్రీ మాట్లాడుతూ ధ్యానులందరినీ సుభాష్ పత్రీజీ తండ్రిలాగా అక్కున చేర్చుకున్నారని తెలిపారు. ఆయన స్థాపించిన ధ్యాన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ధ్యానిపై ఉందన్నారు. అదేవిధంగా పరిమళ పత్రీ, పరిణిత పత్రీ మాట్లాడుతూ నిత్యం ధ్యాన సాధనతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని వివరించారు. పిరమిడ్ అభివృద్ధికి కరీంనగర్ జిల్లాకు చెందిన విజయలక్ష్మి, నాగభూషణం రూ.లక్ష, వేంపల్లికి చెందిన సూర్యప్రకాశ్‌రావు రూ.లక్ష, భారతీదామోదర్‌రెడ్డి రూ.25 వేలు విరాళం అందజేశారు. ధ్యాన సభా వేదికపై కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు, గీతాలాపనలు అలరిస్తున్నాయి. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కొర్పోలు విజయభాస్కర్‌రెడ్డి, సభ్యులు హన్మంతురాజు, సాంబశివరావు, రాఘవరావు, రాంబాబు, శ్రీరామ్‌గోపాల్, శివప్రసాద్, మాధవి, దామోదర్‌రెడ్డి, జయలక్ష్మి, కిషన్‌రెడ్డి, విజయ్‌కుమార్, రాము, నవకాంత్‌తోపాటు ధ్యానులు పాల్గొన్నారు.



ప్రాతఃకాల ధ్యానంలో పాల్గొన్న ప్రజలు

## మత్స్య రంగంలోనూ స్వయం ఉపాధి



శిక్షణ పొందిన వారితో వీసీ, కళాశాల ప్రొఫెసర్లు

పెబ్బేరు, డిసెంబర్ 29 : మత్స్య రంగం అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ వంగూరి రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెబ్బేరులోని మత్స్య కళాశాలలో ఎస్సీ యువతకు చేప ఆధారిత మూల్యాధిక ఉత్పత్తులు, వాటి వినియోగ ప్రయోజనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పశు, పాడి పరిశ్రమలతోపాటు మత్స్య రంగంలో కూడా వివిధ స్వయం ఉపాధి పథకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుంటే ఉపాధితోపాటు మత్స్య రంగం అభివృద్ధికి దోహద పడినట్లవుతుందని వివరించారు. నేషనల్ మీట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి డాక్టర్ బసవరెడ్డి మత్స్య రంగంలో జరుగతున్న పురోగతిని వివరించారు. ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ బార్ బుద్ధ, మత్స్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ మత్స్య ఉత్పత్తుల్లో వివిధ రకాల పోషకాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. చేపలను రోజూ వారి ఆహారంలో భాగంగా తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న 25మంది యువతీ, యువకులకు వైస్ చాన్స్‌లర్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

### యువతిని వేధించిన యువకుడి అరెస్టు

జడ్చర్లటౌన్, డిసెంబర్ 29 : సెల్‌ఫోన్ ద్వారా ఫ్రీఫైర్ గేమ్‌లో పరిచయం చేసుకొని యువతిని వేధిస్తున్న ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు శుక్రవారం జడ్చర్ల సీఐ రమేశ్‌బాబు తెలిపారు. సీఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జడ్చర్ల పట్టణానికి చెందిన ఓ యువతికి సెల్‌ఫోన్‌లో ఫ్రీఫైర్ గేమ్‌లో ఢిల్లీలోని నోయిడాకు చెందిన మనీష్‌ఠాగూర్ అనే యువకుడు పరిచయమయ్యాడు. ఈ క్రమంలో బాధితురాలికి మాయమాటలు చెప్పి ఆమెకు సంబంధించిన వ్యక్తిగత ఫొటోలను సెల్‌ఫోన్‌లో తీసుకొన్న సదరు యువకుడు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు తేరుకొని ఈనెల 26న జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు ఢిల్లీ ప్రాంతంలోని గజియాబాద్‌లో ఉన్నట్లు గుర్తించిన జడ్చర్ల పోలీసులు అక్కడికి వెళ్లి నిందితుడు మనీష్‌ఠాగూర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ వెల్లడించారు.

## హస్తం.. అత్యుత్సాహం

- ప్రజాపాలనకు ఎందుకు పిలవలేదనిఅ ధికారులతో ఘర్షణ
- కాంగ్రెస్ నేతలపై ఫిర్యాదు

మక్తల్ టౌన్, డిసెంబర్ 29 : ప్రజాపాలన లో దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించి సర్పంచ్, అధికారులను దూషించిన ఘటన మండలంలోని గుర్లపల్లిలో చోటుచేసుకున్నది. శుక్రవారం గుర్లపల్లి జీపీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి మధు, ఎంపీవో రహమతుద్దీన్, సర్పంచ్ కళావతి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న సందర్భంలో అక్కడికి వచ్చిన కాంగ్రెస్ నాయకులు భీంరెడ్డి, రాంరెడ్డి సర్పంచ్‌తోపాటు అధికారులను దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులను పిలవకుండా దరఖాస్తులెలా స్వీకరిస్తారు అంటూ నానా యాగి చేశారు. దీంతో ఎంపీవో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు రాగానే కాంగ్రెస్ నాయకులు కాస్త చల్లబడ్డారు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమానికి నాయకుల పెత్తనం ఏంటని పలువురు గుసగుసలాడుతున్నారు. గ్రామానికి చెందిన సర్పంచ్ మహిళ అని చూడకుండా నాయకులు అసభ్య పదజాలంతో మాట్లాడడం ఏంటని గ్రామస్తులు వాపోతున్నారు. ఏదేమైనప్పటికీ గతంలో ఇలాంటి వాతావరణం లేదని, కాంగ్రెస్ వచ్చిన తర్వాత కొత్తగా ఉందని ప్రజలు చర్చించుకోవడం కనిపించింది.

## సైబర్ క్రైం కేసు నమోదు

- వాట్సాప్ మెస్సేజ్‌కు స్పందించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని
- బ్యాంక్ ఖాతాలనుంచి రూ.84 వేలు చోరీ చేసిన దుండగులు

వనపర్తి టౌన్, డిసెంబర్ 29 : వనపర్తి జిల్లా కేంద్రంలో శుక్రవారం సైబర్ క్రైం కేసు నమోదైంది. పట్టణ ఎస్సై యుగేంధర్‌రెడ్డి కథనం మేరకు.. జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ కాలనీకి చెందిన హర్షిణిరెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నది. సెప్టెంబర్ 24న ఆమె వాట్సాప్‌నకు 62812-2112-2828 నెంబర్ నుంచి మెస్సెజ్ వచ్చింది. పార్ట్‌టైం జాబ్ చేస్తే రోజూ రూ.1000 నుంచి రూ.1500 సులువుగా సంపాదించొచ్చని.. మొదటగా రూ.100 చెల్లిస్తే మేము రూ.280 పంపుతామని సందేశంలో ఉన్నది. అయితే, ఆమె రూ.100 పంపించగా రూ.280 వచ్చాయి. తర్వాత టాస్క్ చేసి రూ.100 పంపితే రూ.1,550 వస్తాయని చెప్పడంతో అలాగే చేసింది. డబ్బులు కూడా వచ్చాయి. అలా యాక్సిస్, ఐసీసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల నుంచి రూ.27వేలు, రూ.22 వేలు, ఎస్‌బీఐ నుంచి రూ.35వేలు.. ఇలా మొత్తం రూ.84 వేలు పంపించిన తర్వాత కూడా రూ.30వేలు పంపించాలని డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చి పంపించిన డబ్బులు తిరిగి పంపించాలని అడిగింది. ఎంతకూ డబ్బులు తిరిగి రాకపోవడంతో ఆన్‌లైన్‌లో సైబర్ క్రైం రిపోర్ట్ చేసిందని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## భార్య ఆత్మహత్యకు కారకుడైన భర్తకు జైలుశిక్ష

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, డిసెంబర్ 29: తాగుడుకు బానిసై భార్యను శారీరంగా, మానసికంగా హింసించి ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్తకు రెండున్నరేండ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ జడ్జి బి.పాపిరెడ్డి శుక్రవారం ట్రయల్ కోర్టు తీర్పును ఖరారు చేస్తూ నిందితుడి అప్పీల్‌ను తిరస్కరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కెం జనార్దన్ కథనం మేరకు..

రాజాపూర్ మండలం చెన్నావెల్లికి చెందిన మహ్మద్‌ఇబ్రహీంకు ఫార్జానా బేగంను ఇచ్చి పెద్దల సమక్షంలో పెళ్లి చేశారు. కొంత కాలానికి ఇబ్రహీం తాగుడుకు బానిసై భార్యను మానసికంగా, శారీరకంగా చిత్రహింసలకు పాల్పడేవాడు. జూన్ 12, 2018లో తన కుమారుడు మహ్మద్ మౌలానా ఎదుటనే తిట్టి, కొట్టి ఇబ్రహీం వెళ్లిపోయాడు. ఈ చిత్రహింసలు భరించలేని ఫార్జానా, కుమారుడు మౌలానాకు చాక్లెట్లు తెచ్చుకోమని బయటికి పంపి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ క్రమంలో ప్రాసిక్యూషన్ తరఫున 9 సాక్షులను ప్రవేశపెట్టి, వాదనలతో ఏకీభవించిన జడ్జి తీర్పువెల్లడించారు.